# మార్గదర్శులు

బట్టతల మీద పట్టిన చెమటను కండువాతో తుడుచుకుంటూ హడావిడిగా వాసుదేవయ్య సిటీ బస్సులు ఆగే కూడలి వేపు నడుస్తున్నాడు. తన కళ్ళ ముందే నాలుగడుగుల దూరంలో ఇద్దరు పిల్లలు కూడా అటే వెళ్తున్నారు. అక్కా తమ్ముడూ అయివుండొచ్చు - అనుకున్నాడు. అక్క వీపు మీద బరువైన పుస్తకాల సంచీ వేలాడుతోంది. తమ్ముడి చేతిలోని చిన్న సంచీ నేలను రాసుకుంటూ వాడితో పాటే వెలుతోంది. అక్క ఆ చిన్నవాణ్ణి గొరగొరా ఈడ్చుకు పోతూవుంటే ఆమెతో అడుగులు కలపలేక వాడు ఆయాసపడి పోతున్నాడు. కుడికాలు కాస్త కుంటుతున్నాడు కూడా !

" వాణ్ణెందుకమ్మా ? అలా తొందర చేస్తావు ? నెమ్మదిగా తీసుకుని వెళ్ళకూడదూ ? నీ కన్నా చిన్నవాడు కదా ?" అన్నాడు వాసుదేవయ్య చూస్తూ ఊరుకోలేక.

"ప్రార్థన అయిపోతుంది స్కూల్లో .... " అక్క సమాధానం

" వాడెందుకో కుంటుతున్నాడు పాపం ! దెబ్బతగిలిందేమో !"

దెబ్బా లేదు . గిబ్బాలేదు వాడెప్పుడూ అంతే !

" లేదమ్మా చూడు ఆ కాలిమడమ పూర్తిగా జోడులోకిపోందే .. ఆ అరుగు మీద కూర్చోబెట్టి సరిగ్గా జోడు తొడుగు...."

అక్క కాస్త అర్థమైనట్టు చూసి తమ్ముణ్ణి దగ్గరగా ఉన్న అరుగుమీద కూర్చోబెట్టి ఆ జోడు విప్పింది. ఆ పాదానికి తొడిగిన మేజోడు కాక – ఇంకో మాసిన మేజోడు ఉండ చుట్టుకుపోయి ఆ జోడులోని ముందు కొనలో ఇరుక్కుపోయి ఉంది. ఆ మాసిన సాక్స్‌ని తీసి తన సంచిలో పెట్టుకున్న అక్క చిన్నగా నవ్వుకుంటూ తమ్ముడికి జోడు తొడిగింది. కాలి మడమ పూర్తిగా జోడులోనికి పోవడంతో తమ్ముడు సరిగ్గా నడుస్తూ అక్క చెయ్యి పట్టుకున్నాడు. ఆ పిల్లలిద్దరూ నవ్వుతూ ముందుకివెళ్ళిపోయారు . అలా చెట్టాపట్టాలేసుకుని హాయిగా వెళ్ళిపోతూ వుంటే వాళ్ళవేపే చూస్తూ ప్రసన్నంగా నవ్వుతూ, చుర్రుమనిపిస్తున్న ఎదురెండకు అరచేతిని అడ్డుగా పెట్టుకుని వాసుదేవయ్య

రోడ్ల కూడలి దగ్గర నిలచిపోయాడు. ఇంకాస్త దూరం ముందుకెళ్ళిన పిల్లలు ఒక పెద్ద డాబా ఇంట్లోకి చరచరా దూరిపోయారు.

ఆ డాబా మీద ఎండలో తళతళ మెరుస్తున్న సరికొత్త తగరపు రేకులతో షెడ్లు కడుతున్నారు. పొడుగాటి మనిషి నిలబడితే తల పై కప్పుకి తగిలేటంత చిన్న చిన్న షెడ్లు - ఒక వైపు అప్పటికే కట్టినవి - కనిపిస్తున్నాయి. కరుణా కాన్వెంట్ అని పెద్ద అక్షరాలతో ఒక బోర్డు డాబా ముందు వేలాడుతోంది.

కాసేంత ఆశ్చర్యంగా అటే చూస్తున్న వాసుదేవయ్య దృష్టిని మళ్ళిస్తూ, " మన బస్సు ఇంకా రాలేదు, మొన్నటిలాగ దారిలో ఎక్కడైనా అడ్డం పడలేదు కదా ... ?" అని పలకరించాడు రోజూ నాంపల్లి దాకా కలిసి ప్రయాణం చేసే రాఘవయ్య.

"ఆ షెడ్లు కడుతున్న స్కూలు కొత్తగా పెట్టారా ? ఇదివరకు చూసిన గుర్తులేదు..." అంటూ ఇంకా ఆ డాబా మీద రేకుల షెడ్ల గురించే ఆలోచిస్తున్నాడు వాసుదేవయ్య.

"కొత్తదేం కాదు, ఆరునెలలైంది, కానీ ఈ మధ్యనే పెద్ద బోర్డు రాయించి పెట్టారు. సీట్లు కూడా పెంచుతార్ట" వివరించాడు రాఘవయ్య.

రావలసిన బస్సులింకా రాలేదు. అరచెయ్యి అడ్డు పెట్టుకున్నా ఎదురెండ హింసిస్తూ ఉంటే సంచీలోంచి ఒక పుస్తకాన్ని తీసి మొహానికి అడ్డం పెట్టుకున్నాడు వాసుదేవయ్య.

" మన కాలనీలో సుమారు డెబ్భై గడపకి తక్కువ ఉండదు. ఎందరో పిల్లలూ, పెద్దలూ స్కూళ్ళకనీ కాలేజీలకనీ సిటీలోకి రోజూ పోవాలి, కాస్త ఎండకీ వానకీ రక్షణగా ఒక షెల్టరన్నా కట్టించుకునే పలుకుబడి లేని వాళ్ళా చెప్పండి ? ఈ రోజుల్లో ఎవరి పిల్లల మీద వాళ్ళకే మమకారం లేదేమో ! ఇక ఏ నెంబరు బస్సు ఏ వేపు వెళుతుందో, ఏ వేళకు వచ్చిపోతుందో కొత్తవాళ్ళకైతే అసలు అర్థమే కాదు. ఆ పిల్లలు చూడండి . చెమటలు కక్కుతూ ఎండలో ఎలా ఉన్నారో ! ఇలా అలిసిపోయి బస్సుల్లో ఇరుక్కుని పోయాక వాళ్ళేమి చదువుకుంటారు. వాళ్ళ మొహం " తన ఆవేదనను తోటి ప్రయాణికుడితో పంచుకున్నాడు వాసుదేవయ్య.

" అందుకే - పెద్దయినాక రాళ్లు రువ్వడం - గుళ్ల వర్షం కురిపించడం చేసి సమాజం మీద కసిని చూపిస్తున్నారు " అని తన సిద్ధాంతాన్ని కలబోశాడు రాఘవయ్య.

ఇంతలో రెండు బస్సులు ఒక దాని వెనుక ఇంకొకటి పోటీ పడుతూ వచ్చి వాలాయి.

అప్పటికే వాటిలో జనం ఉన్నారు. దొరికినమేరకు కొందరు సీట్లలో సర్దుకోగా, కొందరు నిలబడ్డారు. ఇంకొందరు ఫుట్ బోర్డు మీంచి గబ్బిలాల్లాగ వేలాడుతూ ఉంటే బస్సులు కదిలిపోయాయి. నాంపల్లి వేపు వెళ్ళే బస్సులో ఇరుక్కున్న వాసుదేవయ్య ఇంకెన్నాళ్ళు, గట్టిగా నెల రోజులు కూడా లేదు. ఆ తర్వాత ఈ అవస్థ నాకుండదు " అనుకున్నాడు మనసులో

★ ★ ★

చిత్రంగా ముందుకాళ్ళను మడిచి, కాసింత దూరాన బండ మీద విశ్రాంతిగా పడుకుందొక మేక, మోర పైకెత్తి నెమ్మదిగా నెమరువేసుకుంటోంది. కిటికీ దగ్గర నిలబడి గడ్డం గీసుకుంటున్న వాసుదేవయ్య ఆ జీవిని చూస్తూ అలా ఉండిపోయాడో క్షణం. దవడలు నిదానంగా కదుపుతూ అరమోడ్పు కళ్ళతో మేత రుచిని ఆస్వాదిస్తూ యోగనిద్రలో ఉన్నట్లు నిరామయంగా కనపడింది.

రేపటి గురించి ఆక్షణంలో దానికి ఏచింతా ఉన్నట్టు తోచదు. ప్రకృతి దానికిచ్చిన వరం అదేనేమో ! మళ్ళా ఆకలి వేసినపుడే ఆర్జించుకునే ప్రయత్నం చేస్తుంది. అవసరానికి మించిన ఆర్జనకు తావే లేదు దాని జీవితంలో. బుద్ధి జీవినని విర్రవీగే మనిషి మాత్రం రెండు క్షణాలైనా అలా నిశ్చింతగా స్థిరంగా గడపలేడు కదా ! అని చిత్రమైన ఊహాగానం చేస్తున్నాడు వాసుదేవయ్య.

'అదేమిటి, ఇంకా గెడ్డం గీసుకోవడమే కాలేదా ?' అన్న నాగలక్ష్మి ప్రశ్నకి తన ఆలోచనల వలయంలోంచి తెప్పరిల్లాడు.

రోజూ ఉరుకులూ, పరుగులేగా ! ఇవాళ ఆదివారం కూడా అలా పరుగు తియ్యాలా ? అని కిటికీ అంచు మీద ఉంచిన రేజర్ని చేతిలోకి తీసుకున్నాడు

"పరుగు పెట్టగపోతేమానె, సంసారం నడవాలి కదా ! ఈ నెలాఖరికి మీరు రిటైర్ అవుతున్నట్లు నాకు చెబితే ఏం పోయింది ? ఎవరో రోడ్డుమీద కనపడ్డ అమ్మలక్కలు నాకు చెప్పాలా ?" అన్నది నిష్ఠురంగా.

వాసుదేవయ్య ఇంకా తన దృష్టిని దూరంగా ఉన్న మేక మీది నంచి మరల్చకుండానే చిన్నగా నవ్వి.

" ఇంతకీ.. ఎవారా అమ్మలక్కలు ? పుట్టినవాడు గిట్టకుండా ఉంటాడా ? ఉద్యోగంలో చేరినవాడు రిటైర్ కాకుండా ఉండిపోతాడా ?" అన్నాడు నిశ్చలంగా.

." నిన్న కూరలు కొనుక్కుంటూ వుంటే కామేశం గారి భార్యట ... ! ఆవిడ కలిసింది ఆవిడే

పరిచయం చేసుకుంది. వదినగారూ ! మీ వారు లెక్కలు బాగా చెప్తారట. మావారికి తెలిసిం
అంటూ.."

భార్య మాటలకు అడ్డువస్తూ "ఇంతకీ ఆ కామేశం గారెవరో నాకు తెలియదే !" నున్న
ఉన్న గడ్డాన్ని వేళ్ళతో తడుముకున్నాడు వాసుదేవయ్య

"అదేనండీ .. మెయిన్ రోడ్డుకి దగ్గరగానే ఎక్కడో వాళ్ళ స్కూలు ఉందట. దానికి అయ
ప్రిన్సిపాలట."

" మా కాలంలో స్కూలు పెద్దని హెడ్‌మాస్టర్ అనే వాళ్ళం. కాలేజీలో పెద్ద అధికారిని ప్రిన్సిపా
అనే వాళ్ళం."

" ఏదో – పోనిద్దురూ ! ఎలా పిలుస్తేనేం ! నన్ను చెప్పనివ్వకుండా ఏదో అడ్డుపుల్ల వేస్తార
కదా ... ఈ సంవత్సరం నుంచీ స్కూలుని పెద్దదిగా చేసి సీట్లు కూడా పెంచుతున్నారట. ముందు ముందు కాలేజీగా చేసే అలోచన కూడా ఉందట ! అంతేకాదు, ఆ కామేశంగారిది కూడా మా ఊరేనట ! మీరు రిటైర్ అవుతున్నట్టు ఎవరో చెప్పారట . వాళ్ళ స్కూల్లో పనిచేస్తే కాస్త వేణ్ణీళ్ళకు చన్నీళ్ళు అన్నట్టుగా మీరు కూడా ఐదు వందలు సాంపాదించుకోవచ్చు. అని వాళ్ళ ఇంటిలో అనుకున్నారట."

వాసుదేవయ్యకు నవ్వొచ్చింది. ఒక్క క్షణం భార్యకేం చెప్పాలో తెలియక సాలోచనగా నిలిచిపోయాడు, ఈ రోజుల్లో కుక్కగొడుగుల్లాగ ఎక్కడ చూసినా స్కూళ్ళే ! అనుకున్నాడు తనలో.

" పిల్లలిద్దరూ ప్రయోజకులై ఉద్యోగాలు చేసుకుని వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడి సంసారాలు ఈదుతున్నారు. వాళ్లకి మన మేం సంపాదించి పెట్టనవసరంలేదు. నీ కెందుకు బెంగ ?" అన్నాడు.

"మనకు వచ్చే పెన్షన్ సరిపోవద్దూ ?"

" ఈ పెంకుటిల్లు ఎంత పాతదైనామనదే ! అద్దె ఇవ్వమని ఎవ్వరూ అడగరు, వచ్చిన పెన్షన్ రాళ్ళు మన ఇద్దరి అవసరాలకూ సరిపోవని భయమా ?"

" అదేం మాట, ఈ రోజుల్లో డబ్బుకి తగ్గ ఖర్చులే లేవా ? అన్నిటికీ ఏదో అంటారు మీరు. ఊరందరిదీ ఒక దారైతే ఉలిపికట్టెదో దారి అన్నట్టుంది. మొన్న మొన్న రిటైర్ అయిన ఆ సుబ్బరాజుగారు ఏదో ఉద్యోగంలో కుదురుకోలేదూ ?"

" అతని దారి వేరు. అతని ఊహ వేరు. ఇన్నేళ్ళుగా కష్టపడ్డావు, ఇక విశ్రాంతి తీసుకోమనే కదా పెన్షన్ ఇచ్చేది ? ఆ కామేశం ఎవడో మీ ఊరివాడైన కారణంగా ఈ ఉద్యోగం చెయ్యమంటావా ఈ వయసులో ? చూడు నాగూ జీవించడానికి డబ్బుతో అవసరం ఉండదనే వాణ్ణికాను. కానీ, అవసరానికి మించిన డబ్బు కోసం పాకులాడి దానితో కొనలేని విలువైనవి వదులుకోకూడదు మనం !"

" ఏదో అర్థంకాని భాష మాట్లాడకపోతే....."

" ఇంతకీ నేనింకా రిటైర్ కాలేదుకదా , ఎందుకింత రాద్ధాంతం? అయినాక ఆలోచిద్దాంలే – ఇవాళ మెహిదీపట్నం వెళ్లొస్తాను. నా స్నేహితుడు ఏదో పెద్ద ఆపరేషన్ చేయించుకుని ఆసుపత్రి నుంచి వచ్చినట్టు తెలిసింది. నేను చూసివస్తే అతనికి కాస్త ధైర్యంగా ఉంటుంది. పాపం నేనంటే ప్రాణం పెడతాడు...." అంటూ నీళ్ళ గది వేపు వెళ్లిపోయాడు నాగలక్ష్మి విసువిసలాడుతూ వంటగదిలోకి దారితీసింది. తన మాట కెన్నడూ విలువలేదనుకుని బాధపడింది.

★★★

పది రోజులు సునాయాసంగా గడిచిపోయాయి. వాసుదేవయ్య యథావిధిగా నాంపల్లి దగ్గర గవర్నమెంట్ హైస్కూలుకి వెళ్లివస్తున్నాడు. కానీ, తనంత తానుగా భార్య ప్రస్తావించిన ప్రతిపాదనకు జవాబుగా ఏదీ తేల్చిచెప్పలేదు. ఉరుకోలేక నాగలక్ష్మి మధ్యలో ఒకసారి ఆ విషయం చిన్నగా కదిలించి చూసింది.

" కామేశంగారి భార్య మళ్ళీ నిన్నకూరల మండీ దగ్గర కలిసింది. వాళ్ల స్కూల్లో మీరు పనిచేసే ఉద్దేశం ఉంటే ఆ ప్రిన్సిపాల్‌గారు మిమ్మల్ని కలుస్తారట. మన ఊరివాళ్లే అన్నావు గదా ఆరు వందల దాకా ఇద్దామని కూడా ఆవిడతో అన్నారట. విన్నారా?"

ప్రశాంతంగా విని, "అలాగే, నేనూ ఆలోచించి విసంగతీ చెప్తానులే" అని వివాదం లేకుండా సంభాషణను తుంచి వేశాడు వాసుదేవయ్య. ఆమె కూడా చేసేదిలేక ఓర్పు వహించింది.

★★★

ఆరోజు సాయంత్రం ఇంటికి వచ్చిన భర్త మొహం పున్నమి వెన్నెలలా వెలిగి ప్రసన్నంగా ఉండడంతో నాగలక్ష్మిలో కొత్త ఆశ చివురించింది. చిన్న పిల్లవాడికి తాయిలం పెట్టినట్టు కమ్మని కాఫీ వేడి వేడిగా అందించింది. ఆనందానికి కారణం ఏదో ఉండకపోదని ఊహించి, " ఇవాళ

ఎందుకో చాలా హుషారుగా ఉన్నారు ?" అంది.

" ఈ కాలనీ పిల్లలు ఎండలో వానలో బస్సుల కోసం పడిగాపులు కాస్తూ ఒక చెట్టయినా నీడగా లేక అవస్థపడుతూ ఉంటే షెల్టరయినా కట్టలేదని పదేపదే అనుకునేవాణ్ణి మనసులో. రెండు మూడు సార్లు నే కాగితం పెట్టి ప్రయత్నించినా లాభం లేకపోయింది. ఇన్నాళ్ళకి ఎవరికో కానీ మంచి బుద్ధి పుట్టింది. పెద్ద షెల్టర్ ఒకటి కట్టడమేకాదు అక్కడ ఒక స్తంభం పాతి దానిమీద విశాలమైన బోర్డు రాయించి కూడా నిలబెట్టారు. దానిమీద అందరికీ స్పష్టంగా కనపడేలాగ – ఏయే బస్సులు అంబర్‌పేట్ వేపుగా వెళ్తాయో, ఏ బస్సులు నాంపల్లి మీదుగా వెళ్తాయో, ఏవి చార్మినార్ దిశగా వెళ్తాయో ... వేరువేరుగా చూపించి ఆ బస్సు నెంబర్ల కెదురుగా అవి వచ్చిపోయే వేళలు కూడా రాయించారు. ఇప్పుడు బస్సుదిగి వస్తూ ఆ షెల్టర్‌నీ ఆ బోర్డునీ చూసి కలా నిజమా ? అన్నంత సంతోషం వేసింది. చెప్తే నమ్మవు నాగూ ! అందరికీ పనికొచ్చే మంచిపని మనంచేసినా, ఇంకొకరు చెయ్యగా చూసినా ఎంత ఆనందంగా ఉంటుందో చూడు...."

నాగలక్ష్మి నిలువునా నీరుకారిపోయింది. 'ముసలితనం మీదపడేకొద్దీ ఇలా మారిపోతారో ఏమో ! ఈ నెలాఖరుకే రిటైర్ అయిపోయే మనిషికి ఆ షెల్టర్ కడితే ఎంత ? బోర్డు పెడితే ఎంత? నాలుగురాళ్ళు సంపాదించుకునే మార్గం చూసుకోక ఇదేమి చాదస్తం ?' అని మనసులోనే అనుకొని మారుమాట లేకుండా విసవిసలాడుతూ వెళ్ళిపోయింది పెరట్లోకి.

★★★

మరో నాలుగు రోజుల తర్వాత సాయంత్రం స్కూలునుంచి నిరుత్సాహంగా ఇల్లు చేరుకున్న వాసుదేవయ్య వీధి అరుగుమీద ఉన్న పడకకుర్చీలో వాలిపోయాడు. మనసంతా గజిబిజిగా ఉంది. భర్త వచ్చినట్టే చూడని నాగలక్ష్మి అతని మనసులోని కోపాన్ని ఊహించలేకపోయింది.

అందుకనే భర్తను చూసీచూడగానే తను చెప్పదలచిన విషయాన్ని ఆ సమయంలో ప్రస్తావించింది.

" ఇది విన్నారా ! ఇంకెవరో టీచరట. కామేశంగారి కాళ్లా వేళ్లా పడుతున్నాడట, ఉద్యోగం తనకిప్పించమని. వచ్చే నెల మొదటి తేదీ నుంచీ అదనంగా టీచర్ని వేసుకోవాలని నిశ్చయించుకున్నార్ట. ఇవాళ మధ్యాహ్నం ఆ కామేశం గారి భార్య మన ఇంటికి వచ్చింది.

మిమ్మల్ని అడిగి ఏ సంగతీ చెప్పేస్తే బావుంటుందని మరీమరీ గుర్తుచేసి వెళ్ళింది" .

"ఇంతకీ....వాళ్ళు నడిపే స్కూలు పేరేమిటన్నావ్ ? ఆ డాబామీద చీనారేకుల షెడ్లు కడుతున్నారు. ఆ కరుణా కాన్వెంటే నా ఏమిటి ?" కటువుగా అడిగాడు వాసుదేవయ్య.

" అవునట ! ఆ కాన్వెంటే వాళ్ళది. అందులోకే టీచరు కావాలట !"నాగలక్ష్మి ఉత్సాహంగా చెప్పడానికి దగ్గరగా వచ్చింది. కానీ భర్త ప్రవర్తన వింతగా ఉండడంతో అలాగే బొమ్మలా నిల్చుండి పోయింది. వాసుదేవయ్య తన మొహం అసహనంగా పక్కకు తిప్పుకుంటూ " ఆ స్కూలు పేరు మళ్ళా నా దగ్గర ఉచ్చరించకు నాగలక్ష్మి పదిమంది పేద పిల్లల్ని ఇంటికి పిలిచి, ఉచితంగా చెప్పమన్నా చదువు చెప్తాకానీ ఆ వెధవ స్కూల్లో చస్తే ఊడిగం చెయ్యను " అన్నాడు.

నాగలక్ష్మికి ఏమీ అర్థంకాక అలా వింటూ నిల్చుది. భర్త అంత కోపంగా ఉండడం ఎన్నడూ చూడలేదు. నిజానికి అతను సౌమ్యుడే. అది ఎవరైనా ఒప్పుకోవలసిందే. ఎటొచ్చీ ఇప్పుడతనికి అంతకోపం తెప్పించిన కారణమేమిటో అంతుచిక్కలేదు.

"జీవితం అంటే విలువలేని వెధవలు, పిల్లలకేమి విలువలు అందిస్తారు కనుక ? దేశానికేం సేవచేస్తారు ? ఇవాళ ఎంత చౌక బారు వెధవలో తెలిసిపోయింది " అంటూ ఉగ్రుడైపోయాడు.

అలుగుటయే ఎరుగని మహితాత్ముడు లాంటి తన భర్త అలా మారిపోవడంతో ఇక తమాయించుకుని తనకెందుకొచ్చిన గొడవ అని వెళ్లిపోయింది. నాగలక్ష్మి ఆరోజుకి ఇక ఆ ప్రస్తావనే ఇద్దరిమధ్యా రాలేదు. మౌనం రాజ్యమేలింది ఆ ఇంట్లో.

మర్నాటి ఉదయం వాసుదేవయ్య స్కూలుకి వెళ్ళిపోయాడు. స్నేహితురాలు సిటీ నుంచి వచ్చి తిరిగి వెళ్లబోతూంటే ఆమెను బస్సు ఎక్కించడానికి తోడుగా నాగలక్ష్మి వెళ్ళింది. ఎక్కడచూసినా కళకళలాడుతూ కరుణా కాన్వెంట్ పోస్టర్లు విజయభేరిని మోగిస్తున్నాయి. - మీ పిల్లలను త్వరగా చేర్చండి ! అలసించిన ఆశాభంగం !! అంటూ వీధి వీధినా గోడల మీదా, గుడి గోపురాలమీదా ఎలక్ట్రిక్ స్తంభాలమీదా నిలబడి అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాయి. రంగు రంగుల కరపత్రాలు అందరి చేతుల్లోనూ రోడ్డుమీదా రెపరెపలాడుతున్నా. అంత పెద్దఎత్తున జరుపుతున్న ప్రచారాన్ని చూసి ఆశ్చర్యపోయింది. చాలా పెద్ద స్కూలే అయి ఉంటుందని మనసులో అనుకుంది. కోరి ఉద్యోగమిస్తామంటూ వస్తే కొమ్మమీదకెగిరి కూర్చున్నట్టు

ప్రవర్తిస్తున్న భర్తను తలచుకుని నిట్టూర్చింది.

రోడ్ల కూడలి దగ్గర బస్సు ఒకటి అప్పుడే బయలుదేరడానికి సిద్ధంగా ఉంది. పరుగులాటి నడకతో తన స్నేహితురాల్ని బస్సులోకి ఎక్కించిన వెంటనే తలవంచుకుని ఇంటిదారి పట్టింది. ఆలోచిస్తూ నడుస్తున్న నాగలక్ష్మి కొత్తగా కట్టిన షెల్టరు కానీ, బస్సు వేళలు తెలిపే బోర్డును కానీ నిశితంగా చూడనేలేదు.

తొలిరోజు మధ్యాహ్నం వరకూ తన ప్రయోజకత్వానికి మురిసి పడుతూ నిలబడిన బోర్డు మాత్రం అత్యాచారానికి గురైన అభాగ్యురాలిలాగ అవమాన భారంతో కుంగిపోయింది. దట్టంగా అంటించేసిన కరుణా కాన్వెంట్ రంగు రంగుల పోస్టర్ల వెనుక మొహం దాచుకుని, తన దుస్థితిని గుర్తించిన ఏకైక వ్యక్తి వాసుదేవయ్య ఆవేదనను తలచుకుని గాఢంగా నిట్టూర్చింది.

**- ఈనాడు ఆదివారం 13 అక్టోబరు - 1996**